# విఫలప్రేమ ::

కథకుడు :
వినోదబాబు

అదంతా సృష్టేగాని ఏ యంత్రంవల్లా తయారయింది కాదు. ఎంత శ్రమపడ్డా నాలుగు గోడల మధ్యా కూర్చొని అటువంటి హాయిని పొందుదామన్నా వీల్లేదు. మానవునకు అతీతమే అదంతా. సృష్టి! అంటే భగవత్ లీల. భగవంతుడు విలాసార్థం తయారుచేసింది సృష్టి. ఎటువంటి మానవునికైనా మంచి భావాలు, నూతన ఆనందాలు కలగడానికి. బాగా పక్షపాతం లేకుండా తోడ్పడుతుంది, ఈ సృష్టి. ఈసృష్టిలోని మాధుర్యం తాలూకు పరిమితి ఎవరు కనుక్కోగలరు ? అదంతా ఉట్టి పిచ్చి దానికి పరిమితేలేదు. కొందరు అవివేకులు సృష్టిలోని మాధుర్యాన్ని అంతా తెలుసుకున్నామని వెఱ్ఱిగా విఱ్ఱవీగుతారు. ప్రకృతి సౌందర్యాన్ని, ఒక్కసారి చూసినంత మాత్రాన్న ఎటువంటి విచారమైనా పటాపంచలైపోతుంది—తన్ను తానే మరుస్తాడు. ఎన్నడూ పొందని నూతన ఆనందం కలుగుతుంది. కల్మషమైన భావాలను తొలగించి నిర్మల భావాలను కలిగిస్తుంది ఈ సృష్టి. ఈప్రకృతి.

అటువంటి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ఒంటరిగా నేను కూర్చున్నాను. ఎందుకో నాకళ్ళంట ఆదో మాదిరిగా నిర్మలమైన నాదృష్టికి మబ్బును కలిగిస్తూ, ఒకటి రెండు ఆనంద భాష్పాలు రాలాయి. నాకేకారణం తెలియదు. అదంతా ప్రకృతిలోనున్న మహాత్వం అనేసి కోని ఊరుకొన్నాను.

అప్పుడే చీకట్లు నలుదిశలా అలుముకుంటున్నాయి. నక్షత్రాలు ఆకాశాన్న పూలు విదజల్లినట్లు, విదజల్లుకొని మిణుకు మిణుకు మంటున్నాయి. వాటిమధ్య నక్షత్రమండలానికి అధిపతైన చంద్రుడు అప్పటికే తన స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. ఆకాశం అంతా నిర్మలంగాఉంది. ముందర గమ్మత్తైన చిన్నచిన్న కెరటాలను, తన విలాసంకో, లేక వాటిని చూడ్డానికి వచ్చిన ఈ మానవుల ఆనందం కోసమోగాని కట్టుతున్నాది, మళ్ళా "చాలు" అన్నట్లుగా కూల్చేస్తున్నాది— ఆనల్లటి సముద్రం ఎంత ఒంటరిగా ఆ సముద్రపుటొడ్డున కూర్చున్నా ఆ కెరటాలధ్వనీ ఆసముద్రము మొజ్జుమాత్రం చెవులను బద్దలు చేస్తున్నాయి.

అలా అక్కడ అచల్లటి గాలిలో సేదదీర్చుకుంటూ ఆ ప్రకృతిలోని మాధుర్యాన్ని పొందుతూ ఆ ఇసుకతిన్నెపై కూర్చున్నా. ఏదో మనస్సులో చిన్న బాధ కలిగింది. చాల సేపాలోచించేను ఆఖరికి తెలిసి పోయింది. ఆ వెన్నెలే నన్ను బాధిస్తోంది. ఇందిర ఎంత చక్కగా ఉంటుంది. బంగారు ప్రతిమ ఆసోగకళ్లు. ఆ సంపెంగవంటి ముక్కు ముద్దులొలికే ఆ చిన్న నోరు, నునుపైన ఆ అపరంజి చెక్కిళ్లూ, ఆ ఓష్టకిసలయములూ వంకువంకుల ఆ పెద్దజుత్తూ, హంసలకు నడకనేర్పే ఆమె నడక, ఆ పచ్చటి దేహం ఇంకా నన్ను ఏదో బాధలో ముంచింది.

ఆమె విగ్రహం అపారంగా నాహృదయంలో హత్తుకుంది. ఇటువంటి సమయాన ఆమెను చేరువలో నుంచుకొని ప్రకృతి మాధుర్యాని, ఆమె అధరామృతాన్ని గ్రోలలేకపోయెనుకదా అని విచారిస్తున్నాను. హృదయం ధైర్యం చెప్పింది. "ఏమంత మించిపోయింది. ఆమెకూడ నిన్ను ప్రేమిస్తున్నాది కదూ ? ఇంకేం ! అనుభవిద్దుగాని ఉండు !" అని మనస్సు హెచ్చరిస్తోంది.

గాని ఒక్కటే సమస్య ఆమెనన్ను ప్రేమిస్తున్నాదా ? ఎవరికి తెలుసు. నన్ను అసహ్యించుకోటం లేదు. అది తెలుసు ఎందుకంటే నేనగుపడేప్పుడల్లా అలా చూస్తునే ఉంటుంది. గాని చూసినంత మాత్రాన్న నన్ను ప్రేమిస్తున్నాదని ఎలా తెలుసుకోను ?

ఇలాంటి ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతున్నాది.

కొంత సేపటికి మళ్ళీ ఈలోకంలోకి పడ్డాను. టైము చూసేను ఎనిమిదైంది. అది చలికాలం, చలి కూడ బాగ వేస్తోంది. పైన జుబ్బాయేగాని కోటువేసుకోడం మరచా. మా అమ్మ కనిపెట్టుకుని ఉంటుందని మెల్లగా లేచి తేలికైన హృదయంతో గబగబా ఇంటికి బయలాదేరేను.

నేను ఇంటికొచ్చేసరికల్లా ఆ అమ్మాయి— బంగారు ప్రతిమ ఇందిర, వాళ్ళరుగుమీద నిల్చుని ఉంది. నన్ను చూడగానే ఓ చిరునవ్వు నవ్వి, జడ కొసను చేతిలో నలుపుతూ ఇంట్లోకి పోయింది. నా హృదయకమలం వికసించింది.

మెల్లగా ఉబుకుతున్న ఆనందంతో ఇంట్లోకి వెళ్ళేను.

మా ఇంటి పొరుగునే ఇందిర వాళ్ళిల్లు కూడ ఉంది. మా అమ్మకీ. ఇందిరవాళ్ళమ్మకీ మేమీఊరొచ్చిన ఓపదిరోజులకల్లా పరిచయం కలిగింది. ఇంట్లో తోచు పోనప్పుడు మా అమ్మ వాళ్ళింటికి పోయి ఏదో సరదాగా ఇవీ అవీ ముచ్చటించుకుంటూవచ్చేది.

ఈ ఊరొచ్చిన మరునాడే సాయంసమయాన్న వాహ్యాళికని బయలుదేరుతుంటే ఇందిర దర్శనం వాళ్ళరుగుమీదైంది. మనస్సు చెదిరింది.

" ఎవరా అమ్మాయి " అని మనస్సులో అనుకోక తప్పింది కాదు. పోనీ అమ్మనడిగి తెలుసుకుందామంటే అంతటి ధైర్యం లేకపోయింది. ఒకటి రెండుసార్లు నేను పెరట్లో ఉన్నప్పుడు ఇందిరని వాళ్ళ పెరట్లో పూలమొక్కలకు నీళ్లు పోస్తుంటే చూసేను. ఆమెకూడ నన్ను చూచింది. సిగ్గుతో కూడిన చూపులు మెరసేయి. మాట్లాడడానికి ఇరువురకు ధైర్యం చాలేది కాదు. ఇంతట్లో ఏదో నిరోధం రావటంవల్ల నిష్క్ర(?)మించేవాళ్ళం.

మొత్తాన ఇరువురకు ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నట్టు కొంచెంగా తెలుసుకోగలిగేను. కాని అంతలోనే అనుమానం కలిగేది. నన్ను ప్రేమించిందా ఆమె? అన్నదో సమస్య. ఈ సమస్యని ఛేధించడానికి సహాయాన్ని వెతుకుతున్నాను.

ఇదీ జరిగిన సంగతి.

బీచినుంచి వచ్చిం తరువాత భోజనానంతరం ఏదోనవలను తిరగవేస్తూ కూర్చున్నాను గాని గంటకో పేజీ చదవడం అవుతుంటేది.

ఇవాళ నేను గుమ్మాలెక్కుతున్నప్పుడు ఓ చిరునవ్వు పారేసింది. దాని అంతరార్థ మేమిటి. నన్ను ప్రేమిస్తున్నాది, కదూ ?

ఇంతలో, నిద్రాదేవి కౌగిట్లో వాలిపోయేను. రాత్రి ఏవేవో కలలు నన్ను కలవరపెట్టేయి.

ఇందిర నాప్రక్కలో కూర్చుంది. నా మోము మీదమోముంచి, " విశ్వం నిన్ను ప్రేమించాను మనిరువురం వివాహం చేసుకొని హాయిగా ఉందాం," అనేసింది. అబ్బ! ఆ మాటలో ఏం తియ్యదనం, ఏం మాధుర్యం, మాట్లాడుతుంటే నవరత్నాలు ఒలుకుతున్నాయా అనిపించింది. గభాలున నా కౌగిట్లోకి ఇందిరను చేర్చుకున్నాను. ఇందిర ఎంత మెత్తగా ఉంది! అబ్బా ఏమిహాయి!!

" విశ్వం, ఇంకా లేవవేంరా ? " అన్న కేక సుఖ స్వప్నంనుంచి నన్ను దూరం చేసింది. ఇందిర లేదే! ఛీ వట్టి పరుపా ? గాని ఏం హాయిగానుంది ఆ సుఖ స్వప్నం!

మధ్యాహ్నం పత్రికను చదువుతుంటే ఎదురుగుండా వాసలోనుంచి "కలలే నిజమై కనుపించే, హా! హా! అభినవ కుసుమశరా," అన్నపాట వినిపించింది.

నా మనస్సు రెస్పాన్స్ ఇచ్చింది.

" నేనుకూడ దానినే కోరుతున్నాను. కలలే నిజమవాలి."

[మిగతా వచ్చేనెల సంచికలో]